# ఒక వెన్నెల రాత్రి




విశాలంగావున్న ఆ గదిలో, డైనింగ్ టేబిల్‌ముందున్న కుర్చీల్లో కూర్చుని వున్న అయిదుగురిలో ఒకతను కొద్దిగా కదిలాడు. తమ మధ్య పేరుకుపోతున్న నిశ్శబ్దాన్ని భరించలేకపోతున్నాడు అతను. చేతిగడియారంవంక చూసుకుని, మిగతా నలుగురినీ ఉద్దేశించి అన్నాడు.

"మనం వద్దనుకున్నా రోజూ తరచుగా కలుసుకుంటూనే వుంటాం. డైనింగ్ టేబిల్‌ముందు అరగంట సేపైనా మనం కలిసి కూర్చోవాలి. మనం అయిదుగురం ఈ గెస్ట్‌హౌస్‌కి వచ్చి అప్పుడే రెండురోజులు దాటిపోయాయి. ఒకరిని గురించి మరొకరు తెలుసుకుని, ఏదయినా మాట్లాడుకుని, పరిచయం చేసుకోవడం మంచిదని నా సూచన."

అద్దాల కిటికీలోంచి, బయట కురుస్తున్న వెండితీగలలాంటి వెన్నెలని

తదేకంగా చూస్తున్న మరొకతను జవాబుగా చెప్పాడు.

"నిజమే. మేము భారతీయులం. ఆంగ్లేయులం కాము. వాళ్ళయితే, మరొకరు పరిచయం చేస్తేకాని, తమంతట తాముగా కొత్తవాళ్ళతో మాట్లాడరు. అలా ఎన్ని సంవత్సరాలయినా ఒకరితో మరొకరు మాట్లాడకుండా, మౌనంగా కాలం గడిపేయగలరుట."

ఆ డైనింగ్ టేబిల్ ముందు కూర్చున్న మిగతా ముగ్గురు కూడా, తమకి ఆ సూచన సమ్మతమేనన్నట్లుగా తలలూపారు.

"భోజనంచేస్తూ మాట్లాడుకుందాం" అన్నాడు మొదటి వ్యక్తి.

అయిదు నిముషాలలో ఆ గెస్ట్‌హౌస్ కేర్ టేకర్ అయిదుగురికీ భోజనం అమర్చాడు. టేబిల్ మీద. అతను వెళ్ళిపోయాక మళ్ళీ మొదటివ్యక్తే చెప్పాడు

'నేను నలుగురిలో వున్నప్పుడు మాట్లాడకుండా వుండలేను. అందుకే అంతా వసపిట్ట అంటారు నన్ను. కాబట్టి నన్ను ఎక్కువసేపు మాట్లాడనివ్వండి."

మిగతా నలుగురూ అతనివంక చిరునవ్వుతో చూసారు, అలాగే నన్నట్లుగా. ఆ మొదటి వ్యక్తి చెప్పసాగాడు.

"నా పేరు పట్నాయక్ ఒరిస్సా రాష్ట్రం నాది. సునబేడానుంచి వచ్చాను బొంబాయికి ఓ పనిమీద. మనం వుండే ఈ "లోనావాల" వేలీ దగ్గిరే కనుక వచ్చాను. చాలామంది స్నేహితులు ఇది తప్పక చూడదగ్గ టూరిస్ట్ స్పాట్ అని చెప్పి పంపారు నన్ను ఇక్కడికి. నిజంగా అద్భుతమైన ప్రదేశం ఇది..."

మరో అయిదు నిముషాలదాకా, పట్నాయక్ తన గురించి, తన కుటుంబం గురించి, కుటుంబ సభ్యుల గురించి, బొంబాయి గురించి, తను మొట్టమొదటిగా వందరూపాయల కాగితం చూసినప్పుడు ఏ విధంగా ఫీల్ అయిందీ, కాకరకాయల గురించి, గాజుల గురించి, ఇలా ఇష్టంవచ్చినట్లు ఒక విషయంనుంచి మరో సంగతిలోకి సంభాషణని మారుస్తూ మాట్లాడుతూనే వున్నాడు.

మిగతా నలుగురూ బ్రెడ్ టోస్ట్ తింటూ, ఏదైవిషయం పట్నాయక్ చెప్పేది వింటున్నారు ఆసక్తిగా. పట్నాయక్ మంచి సంభాషణా చతురుడు. హాస్యంగా మాట్లాడి ఎదుటివాళ్ళని ఆకట్టుకోగల నేర్పు అతనిది.

రెండు మూడుసార్లు మధ్యలో మాట్లాడదామని ఒకరిద్దరు ప్రయత్నించి, తమని నోరుమెదపనివ్వడని గ్రహించి వూరుకున్నారు.

పట్నాయక్ నేషనల్ హైవేస్‌లలోకి వెళ్ళాడు, కొండల గురించి చెప్పటం ఆపి.

"నాలుగు సంవత్సరాలక్రితం నేను

కారులో వెళ్తూంటే ఓ గమ్మత్తు జరిగింది. ఏ కారు ? ...ఇంపాలా అనుకుంటాను. హైవేమీద జరిగింది ఇప్పుడు నేను చెప్పబోయే సంగతి," అని ఆగి, కొద్దిగా మంచినీళ్ళు త్రాగి అన్నాడు.

"బహుశ మీకు ఆసక్తిగానే వుంటుంది. అక్కర లేదంటే చెప్పండి. సబ్జెక్ట్ మార్చేస్తాను." జేబులోంచి రుమాలుతీసి, చెమట పట్టకపోయినా మొహం ఓసారి అలవాటుగా తుడుచుకుని చెప్పుకుపోయాడు మళ్ళీ.

"నాలుగు సంవత్సరాలక్రితం ఓ రాత్రి నా స్నేహితుడి ఇంపాలాలో వెళ్తున్నాను హైవేమీద కారు మెత్తగా సాగిపోతూంటే, ఎదురుగా రోడ్డుమీద ఎవరో అడ్డంగా పడివుండటంచూసి, ఆపాను కారుని. తీరా దిగిచూస్తే ఓ యువకుడు మూలుగుతూ రోడ్డుకి అడ్డంగా పడివున్నాడు "

ఆగి, ఓసారి చుట్టూకూర్చున్న నలుగురి కళ్ళలోకి చూసాడు తను చెప్పేది వాళ్ళకి వుత్సాహంగా వుందా లేదా అని తెలుసుకోడానికి పట్నాయక్ ఏం తెలుసుకోలేకపోయాడు అందుకని మళ్ళీ చెప్పుకుపోయాడు.

"కారుకింద పడ్డావా అని అడిగాను. కాదుట రోడ్డుకి పక్కనేవున్న అడవిలోంచి మూడుమైళ్ళు పాక్కుంటూ వచ్చాడుట వంటిమీద బట్టలన్నీ మాసి, చిరిగి, పేలికలై వున్నాయి కుడి తొడకి కొద్దిగా కిందగా గాయం అయింది। తనని ఎవరో చంపబోతే తప్పించుకుని వచ్చాననీ, దగ్గరలో ఎక్కడైనా వున్న డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్ళమని ప్రాధేయపడ్డాడు. నా భార్య జాలిపడింది ఆ యువకుడిని చూసి సహాయం చేద్దామంది."

మిగతా నలుగురూ తింటూ వినడం గమనించి, వెంటనే చెప్పడం ఆపి, పట్నాయక్ తను తినసాగాడు, వెనక పడటం ఇష్టంలేక.

"తర్వాత ?" అడిగాడు మిగతా నలుగురిలో ఒకడు కొద్దిగా ఆతృతగా.

తల అడ్డంగా వూపాడు పట్నాయక్ ఇంకేం చెప్పడానికి లేదన్నట్లుగా

"అలా వదిలేసి వెళ్ళిపోయారా ?" అడిగాడతను.


"అవును. డాక్టర్ దగ్గరకి ఆ నిర్భాగ్యుణ్ణి తీసుకెళ్ళాలంటే నేను ముప్పై మైళ్లు మళ్ళీ వెనక్కి వెళ్ళాల్సి వస్తుంది. ఇంకెవరైనా సహాయం చేస్తారని, వాణ్ణి రోడ్డుకి అడ్డంగా తొలగించి వెళ్ళిపోయాను "

ఇందాక ప్రశ్నించినతను అడిగాడు మళ్ళీ.

"నాలుగేళ్ళక్రితం ఈ సంఘటన ఎక్కడ జరిగింది?"

"బొంబే - పూనా హైరోడ్ మీద."

"జోగీందర్ కదూ ఆ గాయపడ్డ వ్యక్తి పేరు ?"




''ఏమో ! కావచ్చు ... మీ కెలా తెలుసు ?''

''మీరు అయిదు నిముషాలు నన్ను మాట్లాడనిస్తే, ఆ తర్వాత జరిగింది నేను చెప్తాను. బహుశ మీరు చూసిన యువకుడు ఇతనై వుండచ్చు.''

''చెప్పండి'' అన్నాడు పట్నాయక్ నవ్వి. మళ్ళీ అన్నాడు ఆలోచనగా, "ముందు మీ గురించి చెప్పి, తర్వాత మీరు చెప్పదలచుకున్నది చెప్పండి.''

కంఠం సర్దుకుని చెప్పాడతను.

''నా పేరు టి.ఏ.వాలా. మహారాష్ట్రి యన్ని. బొంబేలో గొరేగావ్‌లో డాక్టర్ వృత్తి ప్రాక్టీసు చేస్తున్నాను. సరిగ్గా నాలుగేళ్ళ క్రితం, ఓ రాత్రి, ఇలాగే వెన్నెల కురుస్తున్న పున్నమిరాత్రి ఎవరో వచ్చి కాలింగ్ బెల్ నొక్కారు. వెన్నెలలో సముద్రం ఒడ్డున వుండటం నా భార్యకి ఇష్టం కాబట్టి జుహూకి వెళ్దా మనుకుంటూండే ఆ డోర్ బెల్ మోగింది. తలుపుతీసాను, స్పృహలేని ఓ గాయ పడ్డవ్యక్తిని నా అనుమతి తీసుకో కుండానే మరో ఇద్దరితో - బహుశః క్లీనర్స్ అనుకుంటాను - కలిసి ఓ లారీ డ్రయివర్ సోఫామీద పడుకోబెట్టాడు. పూనానుంచి బొంబే వస్తున్నాననీ, ఆ పడ్డవ్యక్తి రోడ్డు ప్రక్కగా స్పృహ లేకుండా పడివుండటం చూసి తెచ్చాననీ చెప్పాడా లారీ డ్రయివర్.

"ఆ గాయపడ్డ వ్యక్తే నేను చెప్పిన జోగీందర్. వెంటనే క్లినిక్‌కి తీసుకెళ్ళి పరీక్షించాను జోగీందర్‌ని. కుడికాలులో సరిగ్గా తొడకింద పిస్తోలుగుండు గుచ్చు కుని వుంది. కాలు సెప్టిక్ అయి పోయింది అప్పటికే, ఆ గుండు దిగి చాలా రోజులవటంవల్ల. వెంటనే కాలు తీయకపోతే బ్రతకడని, రాత్రికి రాత్రే ఆపరేట్ చేసి కుడికాలు తీసేసాను. నాకు సహాయంగా ఇద్దరు డాక్టర్లు వచ్చారు ఫోన్ చేస్తే.''

టీ ఏ వాలా ఓసారి అందరివంకా చూసాడు. నలుగురూ క్షణాలు డైనింగ్ టేబిల్ మీద వెలుగుతున్న పెద్ద పెద్ద కొవ్వొత్తుల ఆరింటినీ చూసి మళ్ళీ చెప్పసాగాడు, గొంతు కొద్దిగా తగ్గించి.

"ఆ జోగీందర్ ఎవరో మర్నాడు తెలిసింది.'

ఆ కొవ్వొత్తుల వంకే చూస్తూ మౌనంగా వుండిపోయాడు. అకస్మాత్తుగా మళ్ళీ చెప్పసాగాడు ఏదో ఆలోచనలోంచి తేరుకున్నవాడిలాగా.

జోగీందర్ దొంగ, హంతకుడు. పోలీసుల కళ్ళుగప్పి తిరుగుతున్న స్మగ్లర్ అతన్ని పట్టిస్తే మహారాష్ట్ర ప్రభుత్వం అయిదు వేలు బహుమానం నగదురూపంలో ఇస్తుందన్న సంగతి మర్నాడు తెల్సింది నాకు. అనుమానం వచ్చి, నర్స్ని [illegible] పాత పేపర్లు తిరగేస్తే. అయిదు వేలు ఎవరు వదులుకుంటారు? సంగతి తెలియగానే పోలీస్ స్టేషన్కి ఫోన్ చేశాను...."

"మీరు ఫోన్ చేసింది నాకే."

అంతవరకూ మౌనంగా వున్న మిగతా ముగ్గురిలో ఒక ఆజానుబాహువు చప్పున గట్టిగా అన్నాడు. ఆ డైనింగ్ టేబిల్ చుట్టూ వున్న మిగతా నలుగురూ ఆ ఆజానుబాహువు వంక చూసారు కొద్దిగా ఆశ్చర్యంగా.

"అవును మిస్టర్ టీ ఏ వాలా, ఆ మర్నాడు ఉదయం నేనే మీ ఫోన్ కాల్ని రిసీవ్ చేసుకున్నాను డ్యూటీ అయి వెళ్ళబోతూంటే మీ కాల్ వచ్చింది. తెలతెలవారుతూండగా... నా పేరు చెప్పలేదు కదూ? చంపాలాల్ షా గుజరాతీని నేను

"ఫోన్ కాల్ రాగానే మీ హాస్పిటల్కి వచ్చాను. మరి ఇంకా మీరు స్పృహలోకిరాని జోగీందర్ని అప్పగిస్తే, అంబులెన్స్లో తీసుకెళ్ళాను పోలీస్ హాస్పిటల్కి. జోగీందర్ని గురించి అప్పుడు మీకు చెప్పివుంటాను మన మిగతా మిత్రులకోసం చెప్తాను మళ్ళీ. జోగీందర్ చండీఘర్నుంచి బొంబే వచ్చాడు. పంజాబీ అతను స్మగ్లింగ్లో అందెవేసిన చెయ్యి.

"జోగీందర్ని సెంట్రల్ జెయిల్కి మార్చారు హాస్పిటల్నుంచి. అతను చేసిన అనేక హత్యలు వెలుగులోకి వచ్చాయి. రెండునెలల తర్వాత ఉరి శిక్ష విధించారు."

ఆ అయిదుగురిలో ఒకతను - అప్పటిదాకా మాట్లాడని అతను - రెండుచేతులతో డైనింగ్ టేబిల్ మీద మృదువుగా కొట్టాడు. అందరూ అతని వంక చూసాక చెప్పాడతను.

"జోగీందర్ నాకూ తెలుసు"

మిగతా నలుగురూ అతనివంక చూసారు, ఏంచెప్తాడా అన్నట్టుగా.

''నాకు జోగిందర్ మీ అందరి కన్నా ముందర తెలుసు.''

''ఎలా ? మీ పేరు ?'' అడిగాడు పట్నాయక్, ఇంక మౌనంగా వుండ లేక. గత పదినిముషాలనుంచి అతని నోరు కట్టేసినట్లయింది.

గొంతు సర్దుకుని చెప్పాడతను.

"నా పేరు పుపాధ్యాయ్. బెంగాలీని నేను. బొంబే కస్టమ్స్ శాఖకి చెందిన "ఏంటీ స్మగ్లింగ్" విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాను ఆరేళ్ళ బట్టి. నాలుగు సంవత్సరాల క్రితం దుబాయ్‌నుంచి బంగారం రహస్యంగా రవాణా అవుతున్న వార్త అందింది మాకు. నిర్ణీతమైనచోట కాపున్నాము. మాకు అందిన సమాచారం సరియైనదే. ఓ పెద్ద స్టీమ్‌లాంచ్‌లో దొంగబంగారం తెచ్చారు. దానితోబాటు అరెస్టుచేశాం అక్కడికక్కడే కాని వాళ్ళలో ముఖ్యుడైన జోగిందర్ తప్పించుకున్నాడు

"నేను పూనాలో ఓ ఇంటిదగ్గర కాపున్నాను జోగిందర్ అక్కడికి తరచుగా వస్తూ పుంటాడని తెలిసి. నాలుగురోజుల తర్వాత వచ్చాడు. అరెస్టు చేయబోతే తప్పించుకున్నాడు, నా కంట్లో మిరియంపొడి చల్లి. నా సర్వీస్ పిస్తోల్ నాలుగయిదుసార్లు పేల్చాను పారిపోతున్న జోగిందర్ వైపు. ఒక గుండు అదృష్టవశాత్తు జోగిందర్ కుడికాలి తొడలో గుచ్చు కుందని మన స్నేహితుడు చెప్పాడు."

"వారం పదిరోజులు జోగిందర్ కోసం గాలించాము. సమీపంలోవున్న అడవిలోకి పారిపోయాడని తెలిసి, ఎన్ని వందలో చదరపు మైళ్ళ అడవిని గాలించి విఫలమయ్యాము. చివరికి చిక్కాడు కాని ప్రయోజనం లేక పోయింది. జోగిందర్ తన దగ్గరవున్న పదిలక్షలు విలువచేసే ఫ్రెంచ్ మార్కింగ్స్ గల బంగారం బిస్కట్లు ఎక్కడ దాచిందీ చెప్పనేలేదు."

భోజనం పూర్తయింది అయిదు గురిదీ. పెర్కొలేటర్‌లోంచి కాఫీ కప్పుల్లోకి వంచుకున్నారు అయిదుగురూ. పట్నాయక్ సిగార్ వెలిగించాడు కాఫీ తాగుతూనే ఇంక తనని తను పరిచయం చేసుకోని ఆ అయిదో వ్యక్తిని ప్రశ్నించాడు పట్నాయక్

''మీరు చాలా సేపటినుంచి మౌనం గానే వుండిపోయారే ! మీ గురించి కూడా చెప్పండి.''

మందంగా వున్న కొవ్వొత్తుల వెలుగులో ఆ అయిదో వ్యక్తి నవ్విన నవ్వు ఎవరి దృష్టినీ ఆకర్షించలేదు. చాలా సేపు మౌనంగా వుండిపోయాడు. అందరూ తనవంక కుతూహలంగా చూస్తూండటం చూసి అన్నాడు.

"మీ నలుగురూ స్నేహితులు. భోజనం బల్లదగ్గర వినుగుపుట్టకుండా

వుండటానికి చక్కని విషయం ఆసక్తి కలిగేలా మాట్లాడారు. మీ నలుగురూ ఒకరికొకరు ముందరే తెలుసు నేను మాత్రం మీకు కొత్తవాడినే."

పోలీస్ ఇన్‌స్పెక్టర్ బదులుగా అన్నాడు.

"మిగతా ముగ్గురు స్నేహితులేమో నాకయితే తెలియదుగాని, నాకుమాత్రం ఈ ముగ్గురూ స్నేహితులు కారు. నేను ఒంటరిగానే వచ్చాను."

మిగతా ముగ్గురు కూడా, ఎవరికి వారు విడివిడిగా వచ్చినట్లుగా చెప్పారు మిగతావాళ్ళు తమ స్నేహితులుకారనీ; అసలు వాళ్ళు చెప్పేదాకా వాళ్ళెవరో తెలియదనీ, గుర్తుపట్టలేకపోయామనీ చెప్పారు టీ ఏ వాలా, వుపాధ్యాయ, పట్నాయక్.

"నేను నమ్మలేకపోతున్నాను. మీ నలుగురూ ఇక్కడ, ఇప్పుడు, ఇలా ఏకకాలంలో కలవడం ఎంత యాదృచ్ఛికమైనా నమ్మశక్యంగా లేదు నాకు."

"నాకూ ఆశ్చర్యంగా వుంది. కాని నేను అబద్ధం చెప్పలేదు" అన్నాడు వుపాధ్యాయ. మిగతా ముగ్గురూ కూడా అవునన్నట్లుగా తలలూపారు.

"అలా అయితే మీ నలుగురూ రచయితలై వుండాలి. ఒకరు మొదలుపెట్టిన కథని మరొకరు అందుకుని చివరికి నలుగురూ కలసి పూర్తిచేసారను కుంటాను?" నవ్వాడతను.

"కాదు" నలుగురూ ముక్తకంఠంతో చెప్పారు.

అతను జేబులు తడిమి పైప్‌తీసి వెలిగించుకని, పొగపీల్చి వదిలాడు. మృదువుగా చెప్పాడు.


"కావచ్చు. కాకపోవచ్చు. రచయితలు సాధారణంగా ఇలాంటి దుస్సంఘటనలకి చీకటిరాత్రి, లేదా వర్షంవచ్చిన రాత్రి జరిగిందని వర్ణిస్తారు కథల్లో. మీరు వెన్నెల రాత్రుల్లో ఈ దుస్సంఘటన జరిగినట్లు చెప్పారు. గమ్మత్తుగానే వుంది."

"మీరు కూడా ఏదయినా మాట్లాడండి" అన్నాడు టీ ఏ వాలా, అతను అకస్మాత్తుగా మౌనంగా ఏదో ఆలోచనలో పడటం గుర్తించి.

అతను నెమ్మదిగా చెప్పసాగాడు, మృదుమధురమైన కంఠస్వరంతో.

"మీరు చెప్పిన కథని నేను పూర్తి చేస్తాను. నాకు తోచిన రీతిలో చెప్తాను మిగతా కథని..." అని కాసేపు ఆలోచించి చెప్పసాగాడు

ఉరిశిక్ష మర్నాడు వుదయం అమలు జరుపబడుతుందనగా, ఆ ముందురోజు రాత్రి జోగిందర్ జైల్లోంచి తప్పించుకున్నాడు, కొంతమంది మిత్రుల సహాయంవల్ల. ఒక సంవత్సరందాకా అతను అజ్ఞాతవాసం చేసాడు పోలీసులకిగానీ, కష్టమ్స్ అధికారులకిగానీ చిక్కకుండా ఈ 'లోనావాలా'' వెలిత్రోనే




ఓ ఇంట్లో. ఆ తర్వాత జోగిందర్ పూనా ప్రాంతంలోవున్న అడవుల్లో, తను ఓ రహస్య ప్రదేశంలో దాచి వుంచిన బంగారాన్ని బయటకి తీసి, దాన్ని అమ్మి నగదు సంపాదించాడు.

పూనాలో ఓ బేంక్‌లో ఎకౌంట్ తెరిచాడు మారు పేరుతో. ఆ డబ్బుపైన వచ్చే వడ్డీతో సుఖంగా కాలం గడుపుతున్నాడు. ఆ తర్వాత ఇక పాడు పనులు చేయకుండా ప్రశాంతంగా గడుపుతున్నాడు తన శేషజీవితాన్ని."

మిగతా నలుగురూ మౌనంగా వుండి పోయారు, తమకి అతను చెప్పిన సంగతులు నచ్చనట్లుగా. మంచి కథని పాడు చేస్తే పాఠకుడు ఏ విధంగా నిరుత్సాహ పడతాడో అలా నిరుత్సాహపడ్డారు మిగతా నలుగురు.

అతను గుప్పుగుప్పున పొగపీలుస్తూ నలుగురినీ పరీక్షగా చూస్తూండి పోయాడు, ముఖంమీద చెరగని చిరునవ్వుతో.

'ఇంకో గమ్మత్తు. జోగిందర్‌కి వురితీయబడి చావటం ఇష్టంలేదు. అతని దగ్గరే ఎప్పుడూ మనిషిని అయిదు నిముషాల్లో చంపగలిగే విషం ఒకటి వుంటుంది."

"పట్టుబడితే ఆత్మహత్య చేసుకోడానికా?" అడిగాడు పట్నాయక్.

"అవును. కాని పట్టుబడకుండా చంపడానికి కూడా అది వుపయోగించవచ్చు."

"అంటే?" వుపాధ్యాయ అడిగాడు భృకుటి ముడివేసి.

అతను డైనింగ్ టేబిల్ ముందునుంచి లేచి నిలబడ్డాడు చిన్నగా ఆవలిస్తూ.

"మిగతా కథ రేపు. నాకు నిద్ర వస్తోంది. గుడ్, వెరీ గుడ్. మీరు నలుగురూ మీమీ కాఫీలని పూర్తిగా త్రాగారన్నమాట. హాయిగా నిద్రపోండి. మిమ్మల్నిక ఎవరూ లేపలేరు ... బయట వెన్నెల ఎంత చల్లగా, మెత్తగా, హాయిగా కురుస్తోంది ఆహ్వానిస్తున్నట్లుగా."

అతనివంక విచిత్రంగా చూసారు నలుగురూ.

"మీరు జోగీందర్‌ని చూసినా గుర్తుపట్టలేరనుకుంటాను. కాని జోగీందర్ మాత్రం మిమ్మల్ని మర్చిపోలేదు. మిమ్మల్ని ఎప్పటికీ క్షమించలేడు అతనికి మీరుచేసిన అపకారానికి. పంజాబ్ రాతిగుండె జోగీందర్‌ది. మిమ్మల్ని హత్యచేయక మానడు."

ఇంకా తెల్లబోయి చూసారు ఆ నలుగురూ - పట్నాయక్, టీ ఏ వాలా, చంమూలాల్ షా, వుపాధ్యాయ.

"గుడ్ నైట్ జంటిల్‌మెన్."

వాకింగ్ స్టిక్ ఆసరాతో, పైప్‌లోంచి పొగని ధారాళంగా వదులుతూ, కుంటు కుంటూ, నిశ్శబ్దంగా తలుపువైపు నడచాడా అయిదో వ్యక్తి. అతని కుడి కాలు సహజంగా లేదు. చెక్క కాలది. నడుస్తుంటే బూటులేని చెక్క కాలికి తగిలి ఖంగు ఖంగుమంటూ చప్పుడు చేస్తోంది.

ఆ నలుగురూ అనుమానంగా, గాభరాగా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు మార్చి మార్చి. తర్వాత వెళ్తున్న ఆ కుంటివాడి వంకచూసారు.

"గుడ్ గాడ్, గుర్తుపట్టలేకపోయాం. వాడే జోగీందర్." అరిచాడు వుపాధ్యాయ కీచుగొంతుతో.

"అవును. వాడే జోగీందర్. అంతే కాదు. నా దగ్గర విషానికి విరుగుడు మందు కూడా లేదు ఇప్పుడు." అన్నాడు డాక్టర్ టీ ఏ వాలా, బాధతో మెలికలు తిరుగుతూ.

బయట వెన్నెల పుచ్చపువ్వులా కురుస్తోంది ఆహ్లాదంగా.

